క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మహాదేవపూర్ : మండల వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మిరాజయ్య మంగళవారం తెలిపారు. మహాదేవపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 24,489 మంది ఓటర్లు ఉన్నారని, వారిసంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కాటారం : మండలంలోని గంగారం, విలాసాగర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సీఈఓ ఎడ్ల సతీశ్ ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతులు మల్లయ్య, రాజు, బాపు, లచ్చయ్య, తిరుపతి, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల బంద్



కాటారం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కాటారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ సీఐ ప్రశాంతి ఆధ్వర్యంలో సిబ్బంది మూసి వేయించారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని 12 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు దగ్గర ఉండి సీల్ వేశారు. ఎన్నికలకు 48 గంటల ముందే మద్యం దుకాణాలు మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం మూసి వేసి సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వ చేసిన, విక్రయించిన, రవాణాకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రశాంతి హెచ్చరించారు. మద్యం పంపిణీ, నిల్వలకు సంబంధించిన సమాచారం ఎక్సైజ్ శాఖ అందించి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం



మహాముత్తారం : ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు కొర్లకుంట, యామన్‌పల్లి, కనుకునూర్ గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ర్యాలీలు నిర్వహిస్తు ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సోమ శాంతకుమార్, రైతుసమితి అధ్యక్షుడు మార్క రాము, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచ్ లక్ష్మి, నాయకులు రమేష్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, మద్యం పంచొద్దు

ములుగు : ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను మధ్యపెట్టేందుకు డబ్బు, మద్యం పంచకుండా ఉండగలరా అని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జంపన్న సవాల్ విసిరారు. తాను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా నిజాయితీగా ఎన్నికల్లో నిలబడ్డానని గట్టమ్మ సాక్షిగా ప్రమాణం చేశారు. మిగతా వారంతా తమ నిజాయితీని చూపడానికి గట్టమ్మ తల్లి సమక్షంలో ప్రమాణం చేయాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటా..





చిట్యాల: గండ్ర వెంకటరమణారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు టేకుమట్ల: హాజరైన ప్రజలు

- బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల : మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి గ్రామాల రైతులకు సంబంధించిన భూ సమస్యలను తీర్చే బాధ్యత తనదేనని వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని వరికోల్‌పల్లి , కుమ్మరిపల్లి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యను అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు. అలాగే జిల్లా యంత్రాంగాన్ని తీసుకుని వచ్చి కొంత మేరకు భూ సమస్యను పరిష్కరించామన్నారు. తనకు మరో అవకాశం కల్పిస్తే ప్రధాన సమస్యను పూర్తిగా పరిష్కరించే బాధ్యత తనదేనని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెండెల సాంబయ్య, ఎంపీటీసీ కట్టెకోళ్ళ రాజు, గ్రామస్తులు సాంబయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో వందశాతం దళితబంధు అందిస్తా..

టేకుమట్ల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్లలో వందశాతం దళితబంధు అందిస్తానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని కోరారు. మాయ మాటలు చెప్పే వారు ఎన్నికల వేళ మీ ముందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఇప్పటి వరకు మంజూరైన గృహలక్ష్మి యూనిట్లతో పాటు మరో ఐదువేల యూనిట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చారని, కావున రానున్న రోజుల్లో మీ సొంతింటి కల నెరవేరబోతుందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మి, వంటి పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. నాటకాలు ఆడే వారిని నమ్మకండి, నేను రియల్‌గా ఉంటాను, నాపై పూర్తి విశ్వాసం ఉంచండి.. అభివృద్ధి అంటే చేసి చూపించాను. ఇంకా చేస్తానని అన్నారు. జిల్లాలో కనీసం ఇంటర్ కాలేజీ కూడా లేని రోజుల నుంచి మెడికల్ కాలేజీ వరకు మంజూరు చేయించానని అన్నారు. భూపాలపల్లి రూపు రేఖలనే మార్చేసానని, భవిష్యత్‌లో కనీవిని ఎరుగని రీతిలో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం పలు పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, ఆకునూరి తిరుపతి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, పొలాల సరోత్తంరెడ్డి, ఆది రఘు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా..

మొగుళ్లపల్లి : ప్రజల ఆశీర్వాదంతో మరోసారి భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని వేములపల్లి గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రలో గండ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు గెలిచిన ప్రతిక్షణం ప్రజల మధ్యలో ఉన్నాను తప్ప ఏ ఒక్కరోజు అవకాశ రాజకీయాలు చేయలేదని నమ్ముకున్న ప్రజలకు అభివృద్ధి పనులు చేసి మళ్లీ ఓట్లు అడుగుతున్నానని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు జెండా, ఎజెండా లేదని అధికార పార్టీని దూషించడమే పనిగా ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారే తప్ప వాళ్ల అధికారంలోకి వస్తే చేసే పనులేంటో తెలుపలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. విజ్ఞులైన మొగుళ్లపల్లి మండల ప్రజలు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఒక్కసారి ఓటు వేస్తే ఐదేళ్ల సేవకులుగా మీకు పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, స్థానిక సర్పంచ్ బెల్లంకొండ మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, గ్రామశాఖ అధ్యక్షుడు ఆరెల్లి రమేష్, సంపెల్లి నర్సింగరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్ : సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ సేన నాయకులు

ప్రధాన నగరాలకు దీటుగా అభివృద్ధి

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ప్రాంతాన్ని తెలంగాణలో ప్రధాన నగరాలకు దీటుగా అభివృద్ధి చేశానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో పీజీ, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కళాశాలను సైతం ఏర్పాటు చేసి అధునాతన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

వెంకటరమణారెడ్డికి పలు సంఘాల మద్దతు

భూపాలపల్లి రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్ కుమార్ యాదవ్, ఎమ్మార్పీఎస్(టీఎస్) భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శీలపాక హరీష్‌మాదిగ, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్‌నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేష్‌నాయక్ వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారి సంఘాల బాధ్యులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవులను గుర్తించి గొర్రెలు పంపిణీ చేయడం, ఎస్సీలను గుర్తించి దళిత బంధు, ఎస్టీలకు పోడు భూముల పట్టాలు, తండాల ఏర్పాటు, గురుకులాలు ఏర్పాటు చేశారని ఆయా సంఘాల నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ పాలనతోనే ప్రజాసంక్షేమం

- కాంగ్రెస్ పార్టీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క

ఏటూరునాగారం : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీతక్క బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఓడవాడ నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సీతక్క మాట్లాడారు. సీతక్కను టార్గెట్ చేసి డబ్బు సంచులతో జనాలను మాయ చేద్దామని అనుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల వ్యూహాలను ప్రజలు పటాపంచలు చేశారన్నారు. కేటీఆర్..దమ్ముంటే ఇక్కడికి రా.. ఎవరు రీలో.. రియలో ప్రజలను అడిగి తెలుసుకో అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ట్విట్టర్ పిట్టవు నువ్వు.. నేను ఎక్కిన గుట్టలు, వాగు ఎక్కుతావా అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు ఇచ్చే నోట్లు తీసుకొని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సీతక్క వేడుకున్నారు. గత ఏడాది ఇదే ఏటూరునాగారంలో వరదలు వస్తే ఇప్పుడు వచ్చిన నాయకులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 30న జరిగే ఎన్నికల్లో ఈవీఎంలో రెండో నంబర్ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 80 ఎమ్మెల్యే సీట్లు వస్తాయని, ప్రభుత్వాన్ని నిర్మించుకోబోతుందన్నారు. ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యే అవకాశం ఉందని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. మాజీ మంత్రి జగన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న, ఖలీల్, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్, వావిలాల ఎల్లయ్య, గుడ్ల దేవేందర్, ఉమ్మగాని రమేష్, సప్పిడి రాము, వంగపండ్ల రవి, బాలరాజు, రాధిక పాల్గొన్నారు.



ములుగు రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లు

ములుగు రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షలు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మల్లంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీతక్కకు ప్రజలు బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి , భాదం ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రవిబాబు, లాదె శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా నాయకుడు తండాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే సీతక్క పార్టీ కండువా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్క శ్రీనివాస్, నాయకులు మడకం శోభన్ , కొమ్మినేని శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పలిమెల : ఎన్నికల నేపథ్యంలో మహాదేవ్‌పూర్ సీఐ కిరణ్, పలిమెల ఎస్సై తమాషారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. మండలంలో మావోయిస్టుల వాల్ పోస్టర్లు వెలియడంతో పోలీస్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి నుంచి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాప్‌లను, అలాగే గ్రామాల్లోని కల్వర్టులను తనిఖీ చేశారు. గోదావరి తీరం, మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ కిరణ్ తెలిపారు. ఎన్నికల్లో ఎవరు కూడా భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమీపిస్తుండటంతో ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలకు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తు వారికి అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్‌పీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు టిప్పర్‌ను ఢీకొన్న ఇసుక లారీ

- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



కాటారం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బొగ్గు టిప్పర్‌ను ఇసుక లారీ వెనకనుంచి ఢీకొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గు టిప్పర్ కాటారం వైపు నుంచి భూపాలపల్లి వైపునకు వెళ్తుంది. ఈ క్రమంలో అదే వైపునకు వస్తున్న ఇసుక లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఇసుక లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. గమనించిన పోలీసులు, స్థానికులు, తోటి డ్రైవర్లు, వాహనదారులు డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీయడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికి కాళ్ల కింద భాగం పూర్తిగా క్యాబిన్‌లో ఉండటంతో బయటకు తీయడం సాధ్యపడలేదు. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ కాపాడండి అన్ని ఆర్తనాదాలు పెట్టాడు. దీంతో పోలీసులు ప్రొక్లెయినర్ రప్పించి క్యాబిన్ ముందు భాగం వెడల్పుగా చేయించడంతో డ్రైవర్ బయటపడ్డాడు. డ్రైవర్ రెండు కాళ్లు తెగిపోయి నుజ్జు నుజ్జవడంతో పాటు తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు, స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఇసుక లోడ్‌పై కప్పిన పరద అకస్మాత్తుగా లేచి డ్రైవర్ ముందు ఉన్న అద్దంపై పడటంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ అయ్యప్ప మాలాధారణలో ఉండగా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా సమాచారం. పోలీసులు వివరాలు నమోదు చేసి, ప్రమాద స్థలంలో రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

- కాంగ్రెస్ మంథని అభ్యర్థి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న శ్రీధర్ బాబు

యైటింక్లయిన్‌కాలనీ : గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని మరోసారి ఆశీర్వదించాలని మంథని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను దోచుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వెంకట్రావుపల్లి గ్రామాన్ని సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, చాట్లా సదానందం, విజేందర్ రెడ్డి, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభ సక్సెస్

మంథని: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు మంథనిలో విజయభేరి పేరుతో కాంగ్రెస్ నిర్వహించిన సభ విజయవంతమైంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో మంథని వీధులు కిక్కిరిసిపోయాయి. ఆర్టీసి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో జనం తరలివచ్చారు. సూరయ్యపల్లి క్రాస్‌రోడ్ నుంచి అటు గోదావరిఖని పాత రోడ్డు...పెద్దపల్లి నాలుగువైపులా వాహనాలు, ఎక్కడ చూసినా జనమే కనిపించారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభకు మంథనికి మాజీ ఎంపీ విజయశాంతి వచ్చారు. 2018లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరే గెలుపొందారు. ఈ సారి సైతం అదే సెంటిమెంట్‌తో విజయశాంతిని రప్పించినట్లుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఏటూరునాగారం : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం మండలంలోని రాంనగర్ గ్రామంలో గల పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను అమర్చి నెట్‌కు కనెక్ట్ చేశారు. ఇంటర్నెంట్ సౌకర్యం ఉన్న ప్రాంతంలో వెబ్ కాస్టింగ్ చేయడంతోపాటు నెట్ సౌకర్యం లేని ప్రాంతంలో మెమోరి చిప్ రికార్డు సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రద్దీ, ఓటు సరళిని పరిశీలించడం సులభతరంగా మారుతుంది.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా



భూపాలపల్లి రూరల్ : ఓటు అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి



చిట్యాల: మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

- మీ ఆడబిడ్డగా ఆదరించండి
- బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

చిట్యాల : భూపాలపల్లి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాల్లో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గడప గడపకు ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో అభివృద్ధి కావాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఇంటిని తీర్చిదిద్దేది మహిళలే కాబట్టి అందరూ కలిసి మహిళ అభ్యర్థిగా ఉన్న తనకు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తులను కాకుండా పార్టీ, ప్రజల కోసం పని చేసే బీజేపీకే ఓటు వేయాలన్నారు. తను గతంలో ఓడిపోయాను అయిన నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తున్నన్నారు. కావున మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించాలని కోరారు. బీజేపీ మేనిఫెస్టోలో అన్ని కులాల, వర్గాలకు మేలు జరిగే విధంగా సంక్షేమ పథకాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే బీసీని ముఖ్యమంత్రి చేయడం జరుగుతుందని దేశ ప్రధాని చెప్పారన్నారు. మాట తప్పే పార్టీ తమది కాదన్నారు. మాట తప్పే పార్టీలకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు, ఓబీసీ మోర్చా నాయకుడు పంచిక మహేష్ యాదవ్, బూత్ అధ్యక్షుడు బిస్కుల రవి, మండల కార్యదర్శి నల్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గణేష్, కిరణ్, విజేందర్, రఘుపతి, రమేష్, మొగిలి, శ్రీనాథ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒకసారి అవకాశం ఇవ్వండి..

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని 4వ, 21, 24వ వార్డులు లక్ష్మీనగర్, 6 ఇంక్లైన్ బ్యారక్‌లతో పాటు జెన్‌కోలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కీర్తిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనన్నారు. వారు చేసిన అవినీతిని ప్రజలు గమనించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకున్నారని ఆరోపించారు. ఆపార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని హితువు పలికారు. బీజేపీ కమలం గుర్తుకు ఓటేసి గెలిపిస్తే నియోజక వర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని, మీ కష్ట సుఖాల్లో అండగా ఉంటానని హామీచ్చారు. కీర్తిరెడ్డి సమక్షంలో మహిళలు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్, అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి నాణ్యమైన వైద్యం అందించాలి

భూపాలపల్లి రూరల్ : గుండెపోటుకు గురైనా కార్మికుడికి నాణ్యమైన చికిత్స అందించాలని, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి మున్సిపల్ కార్మికుడికి పని ఒత్తిడి వల్ల గుండెపోటు వచ్చిందని, అధికారులు కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. మంగళవారం ఉదయం అంబేడ్కర్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ధర్నాలో పాల్గొని కార్మికులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పై చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్, రాష్ట్ర దళిత మోర్చా సభ్యుడు బట్టు రవి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే.. సేవకుడిగా పనిచేస్తా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు



ప్రచారంలో మాట్లాడుతున్న పుట్ట మధు

- బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని: కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేళ్లు గోసపడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. లక్కేపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 24గంటల కరెంటుకావాలో మూడు గంటల కరెంటు కావాలో రైతులు ఆలోచించాలన్నారు.

పుట్ట మధుకు ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు

లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్లను పరిష్కరించినందుకు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ తెలిపారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గిరిజనులు పుట్టమధును ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ఓటమి భయంతోనే..

ఓటమి భయంతోనే కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతుందని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మంథని మండలం లక్కేపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంథనిలో కాంగ్రెస్ పార్టీ ఓటమిని అంగీకరించినట్లేనని భావించవచ్చన్నారు. ఇక్కడి నాయకులకు ప్రజల అవసరం లేదు కానీ వాళ్ల ఓట్లు మాత్రమే కావాలని ఆయన దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ మూడోసారి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఈద శంకర్ రెడ్డి అన్నారు. రామగిరి మండలం సుందిళ్లలో కమాన్ పూర్ మార్కెట్ చైర్మన్ దాసరి రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు.

మల్హర్ : తనను ఆశీర్వదించి మంథని ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. చివరిరోజు మండలకేంద్రం తాడిచర్లలో ప్రచారం నిర్వహించారు. శ్రీధర్‌బాబుని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏ ఆడబిడ్డ వివాహానికి సాయం చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ అండగా ఉంటా

కాటారం : మండలకేంద్రంలో భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్‌తో కలిసి బీఆర్ఎస్ పుట్ట మధు రోడ్ షో నిర్వహించారు. అంతకముందు బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ తీశారు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మధు మాట్లాడారు.

కేసీఆర్‌తోనే కార్మికుల సంక్షేమం

రామగిరి: గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కార్మికులు, భూ నిర్వాసితుల పక్షాన పోరాడానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో ప్రచారం చేశారు.